


పెళ్లయిన నలభై సంవత్సరాల తర్వాత నాకు జ్ఞానోదయం అయింది. జీవితంలోని ఒడిదుడుకులను, రకరకాల అనుభవాలను చవి చూసాక నేనుచేసిన తప్పుల్ని, పొరపాట్లని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. నిప్పుని తెల్సి తాకినా, తెలియక తాకినా కాలకమానదు. నా దృష్టిలో నిప్పు - తప్పు ఒక్కలాంటివే.

జగన్నాధరావు గారు నా భర్త. అతను మామూలు మనిషి కాదు. మంచి మనసున్న వ్యక్తి. కష్ట సుఖాల్లో నాకు తోడుగా నిల్చి నన్ను ఎంతో ఆదుకున్న నా జీవిత భాగస్వామి. ఇన్ని సంవత్సరాల కాలంలో అతను కోపగించుకోవడం గాని, విసుక్కోవడం గాని నేనెప్పుడూ చూడలేదు. అలాంటి

మంచి వ్యక్తిని నేను మానసికంగా ఎంతో హింసించాను. చేసిన పాపం చెప్తే పోతుందంటారు. నేనుచేసిన తప్పులు బయటకు చెప్పేస్తే నా మనసుకి కొంత ఉపశమనం కలుగుతుందేమోనని ఆశ. నా వలన ఆయన ఎంత బాధ అనుభవించారో పాపం. అప్పుడప్పుడు నా గోల భరించలేక "నీకు పిచ్చెక్కిందా? దయ్యం పట్టిందా?" అని మాత్రం అనేవారు. కాని నేను, నాది అన్న స్వార్థం మనసులో తిష్ఠ వేసినంత కాలం మంచి మాటలు తలకెక్కవు. స్వార్థం, అహంభావం, పంతం, మూర్ఖత్వం లాంటి భూతాలన్నీ ఒక్కసారి ఆవహిస్తే 'మంచి'ని అసహ్యించుకుంటారు ఎవరైనా. "వివేకం" అట్టడుగున అణిచివేయబడుతుంది. విచక్షణా జ్ఞానం నశించిపోతుంది. గతంలో నేను చేసిన తప్పులు తల్చుకుంటే ఒక్కసారిగా నా మీద నాకే అసహ్యం వేస్తుంది. జీవితం మీద విరక్తి కలుగుతుంది.

జీవితం సంధ్యా సమయం సమీపించి జీవితం ముగియబోతున్న ఈ చివరి రోజుల్లో కనువిప్పు కలిగి జ్ఞానోదయం కలిగితే మాత్రం ప్రయోజనం ఏమిటి? చేసిన తప్పులు దిద్దుకోవడానికి ఆ దేవుడు ఆయుర్దాయాన్ని పెంచడు కదా. అదే నా బాధ !

"మరణం" అంటే హఠాత్తుగా తప్పులు చెయ్యడం మానెయ్యడమే"నని ఎవరో అన్నారు: అది నిజమే. అందుకే అంటారు "పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకల్తో గాని పోవు" అని. నాకు అత్తవారి వైపు వాళ్ళు చాలామందే వున్నారు. వాళ్ళెవరు మా ఇంటికి వచ్చినా నాకు నచ్చేది కాదు. ముఖం ముటముట లాడించుకుంటూ, పలకరించి మాట్లాడే దాన్ని కాదు. ఆయన బాధ పడేవారు. మా ఇద్దరు ఆడపడుచులు ఈ వూర్లోనే వున్నారు.

"అన్నయ్యా !" అంటూ మాటిమాటికీ మా ఇంటికి వచ్చేవారు. వచ్చినప్పుడల్లా చీరలు కొని పెట్టేవారు ఆయన.

"వాళ్ళకెందుకు చీరలు పెడతారు? డబ్బులు దండగ. మీరు చీరలు పెడతారని వాళ్ళు ఇన్నిసార్లు వస్తున్నారు కాని మీ మీద అభిమానంతో కాదు." అని అరిచాను ఒకసారి. వాళ్ళు విన్నారు. వాళ్లు వినాలనే గట్టిగా అరిచాను. పాపం ఆ తర్వాత వాళ్ళు మా ఇంటికి రావడం మానేసారు. చెల్లెళ్ళంటే విపరీతమైన అభిమానం ఆయనకి. వాళ్ళు ముగ్గురూ సరదాగా మాట్లాడుకుంటూ వుంటే నాకు వళ్ళు మండేది.

"చీరలకోసం ఎన్ని నాటకాలు ఆడుతున్నారు వీళ్ళు. ఉత్తుత్తి అభిమానం వలకబోస్తున్నారు !" అని వాళ్ళు వినేలా విసుక్కునేదాన్ని.

"నా వాళ్ళని నాకు కాకుండా చేస్తున్నావు" అన్నారాయన.

అసలు నా కోపమంతా వాళ్ల అదృష్టం మీద, ఎంతో అభిమానంగా చూసుకునే అన్నయ్య దొరకడం వాళ్ళ అదృష్టమే మరి ! నాకూ వున్నాడు అన్నయ్య ఈ వూర్లోనే. ఏనాడూ బ్రతికున్నానా, చచ్చానా అని కూడా అడగడు. మా ఇంటికి రాడు. వాళ్ళింటికి పిలవడు. ఉత్తప్పుడు సరే పండక్కి - పబ్బానికైనా పిల్చి పట్టెడన్నం పెట్టి, పసుపు - కుంకం, జాకెట్టు గుడ్డ యిచ్చిన పాపాన కూడా పోలేదు. అందుకే మా ఆడపడుచుల అదృష్టానికి అసూయ చెందేదాన్ని. వాళ్ళ మనసులు కష్టపడేలా మాటలు విసిరేదాన్ని. వెనక నుంచి ఆయన "వద్దు. అలా అనకు' అన్నా వినేదాన్ని కాదు. పిచ్చిదానిలా మరింత గట్టిగా అరిచేదాన్ని. ఆ దెబ్బకి వాళ్ళు రావడం మానుకున్నారు.

వాళ్ళు మా ఇంటికి రావడం మానేసాక ఆయన నాతో ముభావంగా వుండడం మొదలెట్టారు. నేనది భరించలేకపోయాను. వళ్ళు మండిపోయి ఒకరోజు–

"ఇలా వచ్చి కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాను. అది ఆజ్ఞలా వుంది, కాని అర్థింపులా లేదు.

ఆయన రాలేదు నా దగ్గరకి. గట్టిగా అరిచాను. వచ్చి కూర్చున్నారు.

"ఏమిటో చెప్పు ?" అన్నారు. అతను ఎంతైనా నా భర్త.

నా తళుకు - బెళుకుల్ని చూపిస్తూ అతని దగ్గరగా జరిగి,

"నేనేం చేసానని ! నా మీద మీకెందుకంత కోపం ?" అన్నాను అతని కళ్ళల్లోకి మత్తుగా చూస్తూ.

ఆయన కొంచెం మాట్లాడారు. వెంటనే లేచి వెళ్ళిపోతూంటే "అదేమిటి? అప్పుడే లేచి వెళ్ళిపోతున్నారు?" అన్నాను.

"భార్యాభర్తలు ఐదు నిముషాల కంటే ఎక్కువ మాట్లాడుకోకూడదు.

"అదేమిటి?"

"ఎక్కువసేపు మాట్లాడితే గొడవలు వచ్చేస్తాయి." అని అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయారు. నాకు మరింత కోపం వచ్చేసి జుత్తు పీక్కుంటూ అరిచాను.

"అలా అరవకు. బ్లడ్‌ప్రెషర్ పెరుగుతుంది." అన్నారు వెనక్కి చూడకుండానే. ఆయన తాలూకు వాళ్ళెవర్నీ ఇంటికి రానిచ్చేదాన్ని కాదు. ఎవరొచ్చినా సణుగుతూ వాళ్ళముందే పెద్దనోరు పెట్టుకుని అరిచి ఇంటి పరువు తీసేసేదాన్ని. అలా చెయ్యడం 'తప్పు' అని అలాంటి తప్పులకి శిక్ష పడుతుందని నాకు తెలీదు. తెలిసీ కూడా కొన్ని తప్పులు చేస్తూ నేను

## కళ్ళు

భాష్యాలు చెప్పేందుకు
నోరెందుకు
కళ్ళు చాలవూ ?
చూపుల గేలాలతోనే కద
ప్రేయసీ ప్రియులు
ఒకరినొకరు బంధించుకునేది
అగ్నికణాల తూపులతోనే కద
విద్వేషం రేగి
విధ్వంసం సృష్టించేది
కరుణామృత జల్లులతోనే కద
మానవత్వం జగాన
హరితమై పల్లవించేది
కళ్ళు
మనసులోని భావాలకు
లోగిళ్లు సుమా
చూపుల వాకిళ్ళు
చల్లదనం పంచాలి
మానవతా చలివేంద్రాలు
ఎల్లెడలా విరియాలి

– బద్ది నాగేశ్వరరావు

చాలా తెలివిగా వ్యవహరించానని అనుకునేదాన్ని. కాని ఆయన ఇన్ని సంవత్సరాలుగా తన మంచితనంతో, ఓర్పు – సహనంతో నన్ను ఎంతగా భరిస్తూ వచ్చారో ఇప్పుడు తల్చుకుంటే నా మీద నాకే అసహ్యం కలుగుతోంది ! అంత మంచి భర్త దొరికినందుకు ఆ అదృష్టాన్ని నేను నిలుపుకోలేక పోయాను.

ఆయన చేసే పనులు ఒక్కటీ నాకు నచ్చేవి కావు. ఎవరొచ్చి అడిగినా లేదనకుండా డబ్బు ఇచ్చేవారు. ఎప్పుడైనా తన దగ్గర లేకపోతే, ఎక్కువ వడ్డీకి డబ్బు అప్పు తెచ్చి మరీ ఇచ్చేవారు. వాళ్ళు తిరిగి యివ్వకపోయినా అడిగేవారు కాదు. నేను గొడవపెట్టి ఆయన ప్రాణాలు తోడేసేదాన్ని, "డబ్బు అడగండి. అడగండి" అంటూ.

"వాళ్ళ దగ్గర ఎప్పుడుంటే అప్పుడిస్తారు, ఆ మాత్రానికి అడగడం బాగుండదు." అనేవారు. విపరీతమైన కోపం వచ్చేసి ఆయనతో పోట్లాడేదాన్ని.

"ఇలా వూరి వాళ్ళందరికీ వుత్త పుణ్యాన దానాలు చెయ్యడానికి మన దగ్గర లక్షలు, కోట్లు మూలగడం లేదు. వాళ్ళ కోసం చేసిన అప్పులు మీరు తీర్చడం చాలా బాగుంది. ఎవరైనా వింటే నవ్విపోతారు" అన్నాను ఒకరోజు.

"పాపం ఎంత అవసరం వచ్చి అడిగేరో. లేదని అనలేను." అన్నారు.

"అవున్లెండి. పెళ్ళాం – పిల్లల సంగతి పట్టించుకోరు. కాని వూరి వాళ్ళ కష్టాలన్నీ మీవే. " మళ్లీ గొడవ మొదలెట్టాను.

"నేను నీకేం లోటు చేసేనే? చీరలు, నగలు అన్నీ కొని పెడుతూనే వున్నాను. పిల్లలు మంచి కాలేజీలో చదువుకుంటున్నారు. మనకి స్వంత ఇల్లుంది. కారు వుంది. మనకి ఇంకేం కావాలి చెప్పు. అలా అయిందానికీ, కానిదానికీ రుసరుసలాడతా వెందుకు? నీ ఆరోగ్యం పాడవుతుంది" అన్నారు.

వెనకటికి ఎవర్తో అందట. "నాకేమీ అక్కర్లేదు. కారు, మేడ, నగలు వుంటే చాలు" అందట. ఎన్ని వున్నా నాకు ఒక్కటే లేదు. అది తృప్తి ! ఆయనకి సరదాలు ఎక్కువ. అందరితో కలుపుగోలుగా వుంటారు. ఎప్పుడూ ఆఫీసు స్టాఫ్ నలుగురైదుగుర్ని భోజనానికి పిల్చేవారు. వారానికి రెండు రోజులైనా అలాంటి భోజన కార్యక్రమాలు వుండేవి. నాకు మళ్లీ చిర్రెత్తుకొచ్చేది.

"వాళ్లందరికీ వండి పెట్టడానికి నాకు ఓపిక లేదు" అని విసుక్కునేదాన్ని.

"పోనీలేవే. నేనే వంట చేస్తాను. నువ్వు కూర్చో" అనేవారు నవ్వుతూ. ఆయన అలా నవ్వితే నాకు వంటికి కారం రాసుకున్నట్టు వుండేది. గట్టిగా అరుపులు, కేకలు, ఏడుపులు, ముక్కు చీదడాలు అన్నీ అయ్యేవి. అయినా ఆఖరికి నాకు వంట చెయ్యడం మాత్రం తప్పేది కాదు.

"జగన్నాథం ! ఐటమ్స్ అన్నీ చాలా బాగున్నాయి" అనేసి తేన్చుకుంటూ లేచేవారు వచ్చిన అతిథులు. నాకెందుకో ఈ వ్యవహారాలన్నీ నచ్చేవి కావు. నేను ఎంతసేపూ డబ్బు, నగలు, పట్టుచీరలు... వీటిమీదే ఎక్కువ శ్రద్ధ చూపించేదాన్ని. నేను, నా ఇల్లు, నా మొగుడు, నా పిల్లలు, నా సంసారం తప్ప ప్రపంచంలో ఇంకెవరి విషయాలు నాకు అక్కర్లేదు. "ఎవరెలా పోతే నాకేంటి?" అనుకునే తత్వంనాది. వాళ్ళ బాధల్ని, కష్టాల్ని, సమస్యల్ని మా మీద రుద్ది మమ్మల్ని పీడించుకు తింటారేమోనని భయం నాకు ! ఇలాంటి తత్వం ఆయనకు సరిపడదు.

"మనిషి పుట్టాక మానవత్వం వుండాలి. మనకోసం మనం బ్రతకడంలో అర్థం లేదు. మనం మన చుట్టూ వున్న వాళ్ళకి సహాయపడినప్పుడే మంచిని – మానవత్వాన్ని పెంచగల్గుతాము. మానవసేవే మాధవసేవ అంటారు. పదిమందికీ మంచి చెయ్యడం నేర్చుకో. నీకు మంచి జరుగుతుంది" అనుకునే తత్వం ఆయనది ! అందరి సమస్యలూ ఆయనవే. అందరి కష్టాలు ఆయనవే. అపరిచితులకి కష్టాలొచ్చినా వాళ్ళు చెప్పేవి నమ్మేసి అంతో ఇంతో సహాయం చేసేస్తూ వుంటారు. ఒక్కొక్కసారి అలాంటి వాళ్ళని నమ్మి మోసపోతూ వుంటారు కూడా !

"మన డబ్బు మనకి తిరిగి ఇమ్మని అడగడానికి అంత మొహమాటం ఏమిటి? మీరు అడుగుతారా ! నన్ను వెళ్లి అడగమంటారా?" అని నిలదీసేదాన్ని.

"ఎందుకలా డబ్బు... డబ్బు అని డబ్బు కోసం అంత తాపత్రయ పడిపోతావు ? మనం పోయేటప్పుడు ఈ డబ్బు పట్టుకుపోతామా?" అన్నారాయన ఒకరోజు.

"ఎవరూ పోయేటప్పుడు ఏమీ పట్టుకు పోరు. బ్రతికున్నన్నాళ్ళు కావాలి కదా" అన్నాను వళ్ళు మండిపోయి.

ఆయన అందంగా వుంటారు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుంటారు.

ఒకరోజు ఒకామె వచ్చింది మా ఇంటికి.

"జగన్నాధరావుగారు... వున్నారా?" అడిగింది ఆమె.

"నువ్వెవరు?" అన్నాన్నేను.

"ఆయనకి కావాల్సిన దాన్ని" అందామె.

"కావాల్సిన... అంటే" ఆమెవైపు అనుమానంగా చూస్తూ అడిగాను.

ఆమె జవాబు చెప్పలేదు. నాకు కోపం వచ్చింది.

"ఇంతకీ నీ పేరేమిటి?" నిర్లక్ష్యంగా అన్నాను.

"సుశీల" అంది.

నాలో ఎన్నో అనుమానాలు తలెత్తాయి. ఆమె తెల్లగా, అందంగా వుంది. ఆయనకీ, ఆమెకీ ఏదన్నా సంబంధం వుందేమో ! లేకపోతే ఇంటిదాకా ఎందు



పాతతరం సమర్థ రచయితలలో సుప్రసిద్ధుడైన ఆచంట జానకిరామ్ (1902 – 1992) రచించిన 'నా స్మృతిపథంలో', 'సాగుతున్నయాత్ర' రెండు భాగాలు : మూడు కలిపి ఒకే పుస్తకంగా జేష్ఠ లిటరరీ ట్రస్టు వారు ప్రచురించగా, ఆదివారం (13-7-2008) ఉదయం సుప్రసిద్ధ కథా రచయిత భమిడిపాటి రామగోపాలం నివాస గృహంలో విజయ్ నిర్మాణసంస్థ అధిపతి డా॥ ఎస్. విజయకుమార్ ఆవిష్కరించారు. చిత్రంలో ఎడమనుండి భరాగో, డా॥ ఎస్.విజయకుమార్, శ్రీ ఎమ్. వరహాలశెట్టి, డా॥ సి.బి.ఎస్.ఆర్ శర్మ ఉన్నారు.

కొస్తుంది? నాకు తెలియకుండా ఎన్ని జరిగిపోతు న్నాయి !" ఆయనమీద చాలా కోపం వచ్చేసింది. సుశీల ఆయనకోసం కూర్చుని కూర్చుని వెళ్ళి పోయింది.

ఆయన ఆరోజు ఆలస్యంగా ఇంటికొచ్చారు.

వెంటనే భద్రకాళిలా ఆయనమీద విరుచుకు పడ్డాను.

"ఇలాంటి వాళ్ళు ఇంకా ఎంతమంది వున్నారు మీకు? ఈవిడతో ఎన్నాళ్ళుగా సాగుతోంది నాటకం ? అయినా ఇంత నీచమైన పన్లు చేస్తారని నేను ఊహించలేదు. సిగ్గులేకపోతే సరి. ఇద్దరు పిల్లల తండ్రి అయి వుండి ఏమిటా వెకిలివేషాలు !...." ఆయన్ని పట్టుకుని దులిపేసాను.

"నా మాట విను... అసలు... సుశీల...."

"నాటకాలు కట్టిపెట్టండి. రంకు నేర్చినమ్మ బొంకు నేర్చిందని... దానితో సంబంధం పెట్టుకోవ డమే కాకుండా ఏవో అబద్ధాలు కూడా చెప్తారు. అంతేకదా." అన్నాను ఈసడింపుగా. ఆయన చెప్పేది వినిపించుకోకుండా నోటికొచ్చినట్టు తిట్టాను. ఆ తర్వాత కొన్నాళ్ళకి నాకు తెల్సింది సుశీల ఆయన కొలీగ్ భార్యఅని, ఆ కొలీగ్ చనిపోతే ఆమెకి రావల్సిన డబ్బు ఎంతొస్తుందో కనుక్కుని ఆయన్ని సహాయం చెయ్యమని అడగడానికి వచ్చిందని !

ఆయనతో ఏ ఆడది మాట్లాడినా నేను అనుమానంతో వుడికిపోయేదాన్ని. పెద్ద యుద్ధం చేసేదాన్ని.

"నిజంగా నాకే పాపం తెలీదే.నేను అలాంటి వాడిని కాను" అని ఆయన ఎంత మొత్తుకున్నా వినకుండా వీధిలో అందరికీ వినపడేలా ఏడుపులు, పెడబొబ్బలు పెట్టేదాన్ని.

"నీకు బొత్తిగా సంస్కారం లేదు." అన్నా రాయన.

"అసలు సంస్కారం అంటే ఏమిటో తెలిస్తే కదా నాకు. దానర్థం తెలీదు !

అనుమాన పిశాచం పట్టుకుందినన్ను. నా భర్త నా నుండి ఎక్కడ దూరమైపోతారో, ఏ ఆడదైనా నా భర్తని వల్లో వేసేసుకుని నాక్కాకుండా చేస్తుందేమో నని భయం పట్టుకుంది" అనుమానం విషవృక్షంలా నా మనసులో పాతుకుపోయింది.

కాని ఆయన పాపం నిప్పులాంటి మనిషని, ఆయన ఎప్పుడూఎలాంటి తప్పు చెయ్యలేదని, నన్ను అమితంగా ఇష్టపడుతున్నారని అప్పుడు తెలుసుకోలేక పోయాను. ఆవేశం, మూర్ఖత్వం, అవివేకం నా కళ్ళు కప్పేసాయి. ఇంట్లో ఎప్పుడూ అరుపులు, గోల, కేకలు, ఏడుపులు, బెదిరింపులు వీటితో ఆయనకి మనశ్శాంతి లేకుండా చేసేను. ఇదంతా చుట్టుపక్కలవారికి మంచి కాలక్షేపం అయిపోయింది. ఒక్కనాడైనా ఆయన నా వల్ల సుఖపడలేదు. ఎప్పుడూ ఏదో ఒక కారణం చూపించి ఆయన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నాను.

పిల్లలు పెద్దవాళ్ళయిపోయారు. ఎవరి బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు. ఇప్పుడు ఇన్నాళ్ళకి నయం కాని జబ్బు నాలో ప్రవేశించాక.... నాకు హఠాత్తుగా జ్ఞానోదయం అయింది ! కాని ఇప్పుడు జ్ఞానోదయం అయి లాభం ఏమిటి? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా అయింది ! నా రెండు కిడ్నీలు పాడైపోయాయి. డయాలసిస్‌లు చేసినా ఫలితం లేకపోయింది. ఎవరో కిడ్నీ డొనేట్ చేసారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అయింది. అయినా ఇంకా కొన్ని కాంప్లికేషన్స్ రావడంతో డాక్టర్లు మరి లాభం లేదని చెప్పేసారు. హాస్పిటల్లో వున్నాను. పిల్లలు దూరదేశాల్లో వున్నారు. ఆయన వచ్చి చూసి వెళుతున్నారు. ఆ దేవుడు నాకు తగిన శిక్షే విధించాడు. నేను రోజులు లెక్కపెట్టుకుంటున్నాను. తినడానికి, తాగడానికి మాట్లాడ్డానికి నా నోరు సహకరించలేదు. కళ్ళు పత్తికాయల్లా అయి పోయాయి. శరీరం క్షీణదశకు చేరుకుంది. గతాన్ని తల్చుకుంటూ పశ్చాత్తాపపడ్డానికి మనసు మాత్రం ఇంకా మిగిలిపోయింది.

అసలు నాకు "మనసు" అనేది వుందా? ఉంటే ఎందుకలా రాక్షసిలా ప్రవర్తిస్తాను ?! నాకు మనసు లేదు. బుర్రలో ఆలోచనలు వున్నాయి. అవి గతాన్ని గుర్తుచేస్తూ నన్ను చిత్రవధ చేస్తున్నాయి. నానోట మాట రావడంలేదు. మాట పడిపోయింది. ఆయన నావైపు దిగులుగా చూస్తున్నారు. నాకీ శిక్ష చాలదు. అంత ఉత్తముణ్ని బాధించినందులకు దేవుడు ఇంకా పెద్దశిక్ష విధించాల్సింది. కాని అదేమిటో నేను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఈ మాత్రం శిక్షతో వదిలిపెట్టాడు.

పోవడం అన్నది ఎప్పుడైనా ఎవరికైనా తప్పదు. కాని పోయే ముందు మనసు పడే నరకయాతన ఇది ! దీన్ని ఎవరూ తప్పించలేరు!

ఆ రోజు డాక్టర్లు నన్ను చూడ్డానికి వచ్చారు. వాళ్ళతో పాటు ఆయన కూడా వున్నారు. ఆయన ముఖంలో ఏదో విచారం కనిపించింది ! క్షణంలో సగంసేపు నా కళ్ళు ఆయన్ని చూసాయి. ఏదోమత్తు.. ఏదో సుఖం... శరీరంలోని బాధలన్నీ పోయినట్టు... హాయిగా... ప్రశాంతంగా... నా కళ్ళు మూతలు పడుతున్నాయి! కళ్లు... మూతలు.. పడిపోతున్నాయి!..... శరీరం గాల్లో తేలిపోతు న్నట్టుగా... గమ్మత్తుగా.. హాయిగా... హాయిగా.... నేను....నేను.... ఎక్కడికో... నా .... కళ్ళు.... మూతలు పడిపోయాయి !!?

## భయం.... భయం

ఇప్పుడింక
సూర్యుడ్ని చూస్తే కమలానికి భయమే !
చంద్రుడికి దూరంగా నక్షత్రాలు పారిపోవాల్సిందే
సూర్యోదయానికి పక్షుల జడుపు
తుమ్మెదల్ని చూసి పూలు విప్పారవు
తెమ్మెరలంటే చిగురుటాకుల గజగజ
వానకి భూమి ..... నీళ్ళంటే చేపలు
ఆమెకి అతడు... అంతా భయం.. భయం
కూరగాయలు భయం ముసుగేసుకున్నై
రోబో కంప్యూటర్ల ఆలింగనాలు
రక్తం చిందించే ప్రేమలు....
ఎయిడ్స్... అల్ట్రా... మాలిన్యాలు.... కాలుష్యాలు
ప్రాణాంతక వైరస్‌లు.... ఇన్‌ఫెక్షన్లు
మనిషిని చూసే... తోటి మనిషికి భయం
ఇంక ఈ నేలని చూసి
ఆకాశం కూడా భయపడి పారిపోతుందేమో !

– డా॥ సి. భవానీదేవి